

జయశంకర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో నివాళులర్పిస్తున్న శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, మహిళా నేతలు, తదితరులు

## కారణజన్ముడు జయశంకర్ సార్!

- జీవితమంతా తెలంగాణ కోసమే జయశంకర్ తపన
- మాజీ సీఎం కేసీఆర్‌ను వెన్నుతట్టిన మహనీయుడు
- మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి
- తెలంగాణ భవన్‌లో జయశంకర్ సార్ వర్ధంతి
- సార్ బాటలో పయనిద్దాం: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


హైదరాబాద్, జూన్ 21 (నమస్తేతెలంగాణ): ప్రొఫెసర్ జయశంకర్ సార్ కారణ జన్ముడని, తెలంగాణ కోసమే జీవితాన్ని ధారపోసిన మహనీయుడని మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి కొనియాడారు. కేసీఆర్ సారథ్యంలో సాగిన ఉద్యమంలో ఆయన పాత్ర చిరస్మరణీయమని ప్రశంసించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ మంత్రులు వీ శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, పల్లె రవి కుమార్‌గౌడ్, గెల్లు శ్రీనివాస్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా నేతలు తుల ఉమ, సుమిత్రా ఆనంద్ తనోబా తదితరులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో మధుసూదనాచారి మాట్లాడారు. నాడు జయశంకర్ సార్ కలలుగన్న తెలంగాణను కాంగ్రెస్ విధ్వంసం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రతిఒక్కరూ ఏకమై ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపినప్పుడే మనం ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జయశంకర్ సార్ చూపిన మార్గంలో మనమందరం పయనించాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్‌గా, తెలంగాణ కోసం పోరాడిన గొప్ప వ్యక్తిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రశంసించారు. జయశంకర్ సార్ బతికినంత కాలం తెలంగాణ కోసమే పరితపించారని దేవీప్రసాద్ కొనియాడారు. ఆ మహనీయుడి జీవితం మనందరికీ ప్రేరణగా నిలుస్తుందని తుల ఉమ చెప్పారు. సార్ జీవితాన్ని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని గెల్లు శ్రీనివాస్ ఉద్బోధించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, కిశోర్‌గౌడ్, తుంగ బాలు, కురువ విజయ్‌కుమార్, రంగినేని అభిలాష్, కిర్తీలత పాల్గొన్నారు.


### సార్‌కు సముచిత గౌరవం: కేటీఆర్

స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు సముచిత గౌరవం ఇచ్చిందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఆయన సేవలను స్మరించుకుంటూ బీఆర్ఎస్ సర్కారు భూపాలపల్లి జిల్లాకు, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సార్ పేరు పెట్టి సమున్నతంగా గౌరవించిందని గుర్తుచేశారు. శనివారం కేటీఆర్ ఎక్స్ వేదికగా జయశంకర్ సార్‌కు నివాళులర్పించారు. తెలంగాణ కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు జయశంకర్‌సార్ అని కొనియాడారు. మలి దశ పోరాటంలో కేసీఆర్‌కు గురువులా ఉంటూ ముందుకు నడిపించిన 'సార్' భౌతికంగా మన మధ్యలేకున్నా ఆయన ఆశయాలు, ఆకాంక్షలు కండ్లముందు కదలాడుతున్నాయని కేటీఆర్ తెలిపారు.

### సార్ ఆశయ సాధనకు అంకితమవుదాం: హరీశ్‌రావు

తెలంగాణ రాష్ట్ర సాధనే శ్వాసగా, ధ్యాసగా బతికిన జయశంకర్ సార్ ఆశయ సాధనకు నేటి తరం అంకితం కావాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయనది ప్రత్యేక స్థానమని పేర్కొన్నారు. సార్ మార్గదర్శకత్వం, కేసీఆర్ సారథ్యంలో ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని తెలిపారు. 'బాధిత సమాజం గళం విప్పినప్పుడు విద్యావంతులు కలం పట్టాలి' అని ఉద్బోధించిన జయశంకర్ సార్‌కు శనివారం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు.





సంగారెడ్డి జిల్లా జిన్నారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పాల్గొన్న రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు

# రాష్ట్రంలో కేడీలు.. బేడీల రాజ్యం!

## ఎనుముల కాదు.. కోతల రేవంత్‌రెడ్డి

సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో 2 లక్షల మందికి రైతుభరోసా నిల్

- ఓట్లకు ఓట్లకు మధ్య రైతుభరోసా
- భరోసా కోసం ఓఆర్ఆర్‌పై వంటావార్పు
- సీఎంకు కలలోనూ కేసీఆర్ కన్పిస్తుండు
- వచ్చే ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్సే
- జిన్నారం రైతుధర్నాల్లో హరీశ్‌రావు
- ప్రత్యేక ఆకర్షణగా 'రప్ప..రప్ప' ఫ్లెక్సీలు

సంగారెడ్డి జూన్ 21 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో కేడీల రాజ్యం.. బేడీల రాజ్యం నడుస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. రైతులకు బేడీలు వేసి, జైళ్లలో పెట్టి వారి ఆత్మగౌరవాన్ని రేవంత్ దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుకు బేడీలు వేస్తున్న రేవంత్‌రెడ్డికి ప్రజలు, రైతులు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని రెండు లక్షల మంది రైతులకు రైతుభరోసా డబ్బులను నిలిపివేయడం దారుణమని మండిపడ్డారు. వెంటనే రైతుభరోసా డబ్బులు వేయకుంటే ఓఆర్ఆర్ దిగ్బంధించి వంటావార్పు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని సర్వేలన్నీ బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్తున్నాయని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ రైతులకు రైతుభరోసా డబ్బులు నిలిపివేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిన్నారంలో రైతు ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ధర్నాలో పాల్గొన్న ఆయన రైతులనుద్దేశించి ప్రసంగించారు. రైతులపై రేవంత్ పగబట్టారని అన్నారు. రెండు లక్షల మంది రైతులకు రైతుభరోసా కోత పెట్టడమే కాకుండా కేసీఆర్ కిట్, న్యూట్రిషన్‌కిట్, ఫీజు రీయంబర్స్‌మెంట్, పెన్షన్లకు కోతలు పెట్టారని ఆరోపించారు. అందుకనే ఆయనను కోతల రేవంత్‌రెడ్డి అంటున్నామని చెప్పారు. ఇలా అన్నందుకు తమపై కేసులు పెడతారేమోనని అనుమానం వ్యక్తంచేశారు. కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతుబంధు వేస్తే రేవంత్‌రెడ్డి ఓట్లకు ఓట్లకు మధ్య రైతుభరోసా డబ్బులు జమచేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎంపీ ఎన్నికలకు ముందు ఒకసారి రైతుభరోసా వేశారని, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు మరోమారు రైతుభరోసా డబ్బులు వేశారని విమర్శించారు. రెండు దఫాలుగా ఎగ్గొట్టిన రైతు భరోసా డబ్బులు కూడా వేస్తేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, లేదంటే గుణపాఠం చెప్పాలని రైతులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏ సర్వే చూసినా కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారని చెప్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్, కేసీఆర్ పేరు ఎత్తకుండా రేవంత్‌రెడ్డి ఎక్కడా ఉపన్యసించడం లేదని, ఆయనకు కూడా మళ్లీ గులాబీ జెండా వస్తుందని అర్థమైందని పేర్కొన్నారు. రేవంత్‌కు నిద్రలో కూడా కేసీఆరే యాదికి వస్తున్నారని ఎద్దేవా చేశారు.

> కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతుబంధు వేస్తే రేవంత్‌రెడ్డి ఓట్లకు ఓట్లకు మధ్య రైతుభరోసా డబ్బులు జమచేస్తున్నారు. అప్పట్లో ఎంపీ ఎన్నికలకు ముందు ఒకసారి రైతుభరోసా వేస్తే, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు మరోమారు రైతుభరోసా డబ్బులు వేశారు.
>
> - హరీశ్‌రావు

> లగచర్లలో గిరిజన రైతులకు, ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకించిన రైతులకు రేవంత్ సర్కార్ బేడీలు వేసి జైలులో వేసింది. రైతులకు బేడీలు వేయడమే రైతు రాజ్యమా? దేశానికి అన్నంపెట్టే రైతుల చేతులకు బేడీలు వేసిన రేవంత్‌రెడ్డికి రైతులు గుణపాఠం చెప్పాలి.
>
> - హరీశ్‌రావు

### రైతులకు బేడీలు వేయడమే రైతు రాజ్యమా?

లగచర్లలో గిరిజన రైతులకు, ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకించిన రైతులకు రేవంత్ సర్కార్ బేడీలు వేసి జైలులో వేసిందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు బేడీలు వేయడమే రైతు రాజ్యమా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో రైతురాజ్యం నడిచిందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ రైతులకు రైతుబంధు ద్వారా నగదు బదిలీ చేశారని, ఉచిత కరెంటు, రైతురుణమాఫీ, రైతుబీమాలాంటి ఎన్నో పథకాలు అమలు చేశారని వివరించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్‌రంగం ఆకాశాన్ని తాకిందని, ఇప్పుడు పిల్లల పెండ్లి కోసం, దవాఖాన ఖర్చుల కోసం ఆపదలో భూములు అమ్ముకుందామంటే కొనేందుకు ఎవ్వరూ ముందుకురావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్ పాలనలో రైతు పతారా ఖతమైందని ధ్వజమెత్తారు.

> పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్‌రంగం ఆకాశాన్ని తాకింది. ఇప్పడు పిల్లల పెండ్లి కోసం, దవాఖాన ఖర్చుల కోసం, ఆపదలో భూములు అమ్ముకుందామంటే కొనేందుకు ఎవ్వరూ ముందుకురావడం లేదు.
>
> -హరీశ్‌రావు

### మిల్లెట్స్.. పప్పుధాన్యాలకు తేడా తెలియని సీఎం

రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీ పరువు తీస్తున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేవారు. మిల్లెట్స్‌కు, పప్పుధాన్యాలకు ఆయనకు తేడా తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రసంగించిన రేవంత్‌రెడ్డి కందులు, పెసర్లు మిల్లెట్స్ అని చెప్పడంతో విద్యార్థులు విస్తుపోయారని చెప్పారు. బేసిన్ల గురించి కూడా రేవంత్‌రెడ్డికి తెలియదని, ఇటీవల జరిగిన అఖిలపక్ష సమావేశంలో దేవాదుల ఏ బేసిన్‌లో ఉంది? బనకచర్ల ఏ బేసిన్‌లో ఉంది? నల్లమల్ల ఎక్కడ ఉందంటూ పరువుతీశారని మండిపడ్డారు. ఇటీవల తనకు జ్వరం వస్తే రేవంత్‌రెడ్డి విమర్శలు చేయడం విడ్డూరంగా అనిపించిందని పేర్కొన్నారు. తనపై ఎత్తుపైనా రేవంత్‌రెడ్డి అప్పుడప్పుడూ వ్యాఖ్యలు చేస్తారని తెలిపారు. 'నువ్వుపొట్టిగా ఉన్నందుకు నేనేమి చేయాలి రేవంత్.. నిన్ను గుంజినా పెద్దగా కావు' అని ఎద్దేవా చేశారు. ధర్నాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర నాయకులు ఎర్రొళ్ల శ్రీనివాస్, పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, బీఆర్ఎస్ జిల్లా నేతలు జైపాల్‌రెడ్డి, మఠం బిక్షపతి, రాధాకృష్ణశర్మ, వెంకటేశ్‌గౌడ్, ప్రకాశ్‌చారి, బాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మెట్టుకుమార్, శ్రీకాంత్‌గౌడ్, సోమిరెడ్డి, అంజయ్య యాదవ్, రాములుగౌడ్ పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న 'రప్ప..రప్ప' ఫ్లెక్సీలు

జిన్నారం రైతు ధర్నాలో పుష్ప 2 సినిమాలోని 'రప్ప..రప్ప' డైలాగ్‌లతో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రదర్శించిన ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతూ జిన్నారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ ఫ్లెక్సీలు ప్రదర్శించారు. వీటిలో కేసీఆర్, కేటీఆర్‌తోపాటు హరీశ్‌రావు ఫోటోలు ఉన్నాయి. ఫోటోల దిగువన '2028లో రప్ప..రప్ప 3.0 లోడింగ్' అనే డైలాగులు ముద్రించారు. బాలగౌని సాయిచరణ్ గౌడ్ చేయించిన ఈ ఫ్లెక్సీలు ముద్రించారు.

## ముందుగా హంద్రీనీవా, వంశధార పూర్తిచేయాలి


- సీపీఐ నేత కే నారాయణ



హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు కంటే ముందుగా హంద్రీనీవా, వంశధార ప్రాజెక్టులను పూర్తిచేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ సూచించారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం సముద్రంలోకి వృథాగా పోయే జలాలను వినియోగించుకోవడం మంచి నిర్ణయమే అని పేర్కొన్నారు. అయితే, గోదావరి జలాల విషయంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కేంద్రంతో చర్చించి సమస్యను పరిష్కరించుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను సీపీఐ స్వాగతిస్తున్నట్టు చెప్పారు. రెండు రాష్ట్రాలుగా విడిపోయినంత మాత్రాన తెలుగువారు శత్రువులు కాదని, ప్రాంతీయ ధోరణితో రెచ్చగొట్టే ప్రయత్నాలు ఉభయ రాష్ట్రాలకూ మంచిది కాదని నారాయణ అభిప్రాయపడ్డారు.

# తెలంగాణ నీ తాత జాగీరా?

- తెలంగాణకు 1,500 టీఎంసీలే చాలంటూ ఎలా నిర్ణయిస్తవు?
- కేసీఆర్ అదనపు వాటాగా 1,950 టీఎంసీలు కోరారు
- దానికి వక్రభాష్యం పలుకుతారా?
- చంద్రబాబుకు గురుదక్షిణగా ఇస్తానంటే మేం ఊర్కోవాలా?
- సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రవణ్ మండిపాటు



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): 'రేవంత్‌రెడ్డీ.. తెలంగాణ ఏమైనా నీ తాత జాగీరా? గోదావరి, కృష్ణా నదుల్లో మొత్తం 1,500 టీఎంసీలు తెలంగాణకు వదిలి మిగితా నీళ్లను ఆంధ్రా వాళ్లు ఏమైనా చేసుకోవచ్చు.. అని అనడానికి' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బేవరేజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌తో కలిసి ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ వాటా 1,500 టీఎంసీలే కాకుండా, గోదావరి నదిలో వృథా అవుతున్న 3,000 టీఎంసీలలో తెలంగాణ వాటాగా 1,950 టీఎంసీల నీటి వాటాను 2016లోనే తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అపెక్స్ కౌన్సెల్‌ను కోరారని చెప్పారు. ప్రస్తుతం దానికి వక్రభాష్యం పలుకుతూ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం కేసీఆర్ వల్లే అంటూ సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి.. చిల్లర రాజకీయాలకు చిరునామాగా మారాడని, సీఎం హోదాలో ఉన్న ఆయన నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు చెప్తున్నారని తూర్పారబట్టారు. తెలంగాణ వాటా నీళ్లను చంద్రబాబును అడుక్కుంటావా? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణలో 86% సాగు యోగ్యమైన భూమిగా మారిందన్న విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. కానీ రేవంత్ హయాంలో ఉన్నదానిలో 2% తగ్గిందని ఆరోపించారు.

### కర్రుకాల్చి వాతపెడతరు

ఏపీ సీఎం చంద్రబాబుకు గోదావరి, కృష్ణా జలాలను పణంగా పెడితే తెలంగాణ ప్రజలు కర్రుకాల్చి వాత పెడుతారని సీఎం రేవంత్‌రెడ్డిని దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. తెలంగాణ ప్రాంత ప్రయోజనాల కోసం కేసీఆర్ ముందుచూపుతో వృథా జలాలను ఒడిసి పట్టుకోవాలని ఆలోచిస్తే, రేవంత్ మాత్రం ఆ నీళ్లను చంద్రబాబుకు అప్పగించాలని కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీని నొప్పియకుండా, చంద్రబాబును మెప్పించాలనే ధోరణితో రేవంత్ ముందుకు పోతున్నారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై నరనరాన విషం నింపుకుని మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. పొట్టిగా ఉన్న నువు ముఖ్యమంత్రివి కాగా, మాజీ మంత్రి హరీశ్‌రావు పొడుగ్గా ఉంటే నీకొచ్చిన నష్టమేమిటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు.

### దమ్ముంటే హరీశ్‌రావుతో చర్చకు రా?

తెలంగాణపై, నదీజలాల విషయంలో, తెలంగాణ హక్కులు, వాటాలపై ఎవరికెంత జ్ఞానం ఉన్నదో తెల్చుకోవడానికి హరీశ్‌రావుతో నువు చర్చకు సిద్ధమేనా? అని సీఎం రేవంత్‌ను దాసోజు ప్రశ్నించారు. హరీశ్‌రావు ఒక్కడే వస్తడు.. దమ్ముంటే నువు 100 మందితో వచ్చినా సరే చర్చకు సిద్ధమేనని సవాల్ విసిరారు. బాడీ షేమింగ్ గురించి సీఎం స్థాయిలో ఉండి మాట్లాడొచ్చా? అని నిలదీశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చిరుమళ్ల రాకేశ్‌కుమార్, రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సెంటివ్‌ల రికవరీపై రాష్ట్రాలతో సమావేశం

- 27న భేటీపై రాష్ట్రాలకు కేఆర్ఎంబీ లేఖ

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): అధికారులకు ఇచ్చిన ఇన్సెంటివ్‌లను రికవరీ చేయవద్దని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు ఇటీవల హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ అంశంపై రాష్ట్రాలతో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు 27న ప్రత్యేకంగా బోర్డు సమావేశాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రాలకు కేఆర్ఎంబీ శనివారం లేఖ రాసింది. రివర్ బోర్డులలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఇంజినీర్లకు మూల వేతనంపై 25% ఇన్సెంటివ్‌ను అమలు చేయాలని బోర్డు గతంలో నిర్ణయించింది. రెండేండ్లపాటు అమలుచేసింది. అయితే బోర్డులు కేంద్ర ప్రభుత్వ సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని, ఇన్సెంటివ్‌ను చెల్లించవద్దని, ఇప్పటివరకు ఇచ్చిన సొమ్మును అధికారుల నుంచి రికవరీ చేయాలని కేంద్ర జల్‌శక్తి శాఖ ఆదేశాలు జారీచేసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు హైకోర్టును ఆశ్రయించారు. అయితే అధికారులకు చెల్లించిన ఇన్సెంటివ్స్ సొమ్మును రికవరీ చేయవద్దని, తదుపరి ఇన్సెంటివ్ చెల్లించాలా? వద్దా? అనేది బోర్డే నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ విషయంపై చర్చించేందుకు 27న కేఆర్ఎంబీ సమావేశాన్ని ఏర్పాటుచేసింది.

# ఆర్టీసీ కార్మికులకు 'ఎలక్ట్రిక్' షాక్

## రోడ్డున పడనున్న 10 వేలమంది ఉద్యోగులు, కార్మికులు?

- టీజీఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్‌ల రాకతో ఉద్యోగాలకు ముప్పు
- కేంద్రం అసంబద్ధ పథకం... రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం
- అనుభవంలేని డ్రైవర్లతో సురక్షిత ప్రయాణం ప్రశ్నార్థకం
- ప్రభుత్వాల తీరుపై కార్మిక సంఘాల నేతల మండిపాటు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా పదివేల మంది ఆర్టీసీ కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తమవుతున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి ఈ-డ్రైవ్' పథకంలో భాగంగా 2800 బస్సులు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం కోరగా, 2000 బస్సులు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) విధానంలో ఇప్పటికే వందల బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ బస్సుల నిర్వహణ బాధ్యత మొత్తం ప్రైవేటు సంస్థ చేతుల్లోనే ఉంటుంది. కాబట్టి డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ కార్మికులంతా సంస్థకు చెందినవారే ఉంటారు. దీంతో ఆర్టీసీలోని సుమారు 10 వేల ఉపాధిని కోల్పోయే ప్రమాదముందని కార్మిక సంఘాల నేతలు చెప్తున్నారు.

### ప్రైవేటుకు వరం... ఆర్టీసీకి భారం

కేంద్రం మొదటి దశలో వివిధ రాష్ట్రాల ఆర్టీసీలకు 14,028 ఎలక్ట్రిక్ బస్సులను రాయితీపై అందించాలని నిర్ణయించింది. ఈ రాయితీని కార్పొరేట్ సంస్థకు ఇస్తుందని కార్మిక సంఘాల నేతలు చెప్తున్నారు. మరమ్మతులు కూడా ప్రైవేటు సంస్థనే చూసుకుంటుంది కాబట్టి ఆర్టీసీ గ్యారెజీలు ఉనికిని కోల్పోతాయని చెప్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీ డిపోల పరిధిలో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ వనరులను వాడుకుంటూ ప్రైవేటు కంపెనీ లబ్ధి పొందుతుందని, ఆర్టీసీకి, కార్మికులకు, ప్రజలకు ఎలాంటి ఉపయోగంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల పొట్టకొట్టకుండా తెలంగాణ ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసేలా అధికారాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం.. కేంద్రంపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడంలేదని మండిపడుతున్నారు. కేంద్రం అందించే ఎలక్ట్రిక్ బస్సులు నేరుగా ఆర్టీసీకి ఇవ్వాలని కోరుతున్నారు. అనుభవం లేని ప్రైవేటు డ్రైవర్లతో ప్రయాణికుల భద్రత కూడా ప్రశ్నార్థకం కానుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) పద్ధతిని రద్దు చేసి, ఆర్టీసీలే స్వయంగా ఎలక్ట్రిక్ బస్సులను కొని నడుపుకోవడానికి పథకంలో సవరణలు చేయాలని కార్మిక సంఘాల నేతలు కోరుతున్నారు.

**కళ్యాణమస్తు**

**వధువు కావలెను**

*ఆర్య వైశ్య అబ్బాయి 1989 మార్చ్, M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, 38 వేలు, ఆస్తి 1 కోటి, నల్లగొండ, వీరయ్య, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డుకు బయోడేటా.

# ఆటోడ్రైవర్ల అరణ్యరోదన!

- ఏడాదిన్నరలో 125 మంది సూసైడ్
- ఉసురు తీస్తున్న ఉచిత బస్సు పథకం
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- సర్కార్ బాకీ రూ. 1,000 కోట్లు!
- అమలుకు నోచని 12 వేల హామీ

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలు ఆగడం లేదు. నడిరోడ్డుపైనే ప్రాణాలు తీసుకుంటున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వారిని అప్పుల ఊబిలోకి నెట్టివేసింది. కుటుంబ భారం మోయలేకపోతున్నారు. ఇలా అప్పుల అగాధంలోకి కూరుకుపోయిన ఆటో డ్రైవర్లను ఆదుకునేవారే కరువయ్యారు. ఫలితంగా ఏడాదిన్నర కాలంలోనే రాష్ట్రంలో 125 మంది ఆటో డ్రైవర్లు తనువు చాలించారు. అయినా ప్రభుత్వంలో చలనం రావడంలేదు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుకు చొరవ తీసుకోవడమే లేదు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ఉచిత బస్సు ప్రయాణంతో కోట్లాది మంది మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. నాణేనికి మరోకోణం చూడటం మర్చిపోయింది. ఆ పథకం తొలినాళ్ల నుంచే లక్షలాది మంది ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డున పడ్డాయి. గిరాకీ కరువైంది. వాహనాల ఫైనాన్స్ చెల్లించలేని దుస్థితి. రోజు గడవడమే కష్టతరమైంది. కుటుంబ పోషణ భారమై ఎందరో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర కాలంలో 500 మందికిపైగా అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటే, 125 మందికి పైగా ఆటో డ్రైవర్లు తనువు చాలించారు. ఏడాదికి జీవన భృతి కింద రూ.12 వేలు ఇస్తామని, ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముంగిట కాంగ్రెస్ ఇచ్చిన ఈ హామీలు ఏడాదిన్నర దాటినా కార్యరూపం దాల్చలేదు.

### ఈ ఆత్మహత్యల పాపం ఎవరది?

జీనవ భృతి ఇప్పిస్తామని, కార్పొరేషన్ పెట్టి ఆటో డ్రైవర్లను అందలం ఎక్కిస్తామని ఆశలు కల్పించిన ప్రభుత్వం.. ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ఆటోడ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 125 మంది ఏడాదిన్నరలోనే చనిపోతే ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదంటున్నారు. తమ తోటి డ్రైవర్లు ఆత్మహత్యల పాపం ఎవరిది? అని ప్రశ్నిస్తున్నారు. ఎందుకు ఆటో డ్రైవర్లపై ప్రభుత్వం కనికరం చూపడం లేదు? ఇంకా ఎందరు చనిపోవాలి? ఎంతమంది చనిపోతే ఈ ప్రభుత్వానికి కనికరం కలుగుతుంది? అని నిలదీస్తున్నారు. ఈ ఆత్మహత్యలు.. ప్రభుత్వ హత్యలేనని తోటి కార్మికులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై ప్రభుత్వం సరైన ప్రకటన చేయకపోతే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు.

### ప్రభుత్వం పడిన బాకీ రూ.1000 కోట్ల పైనే..

కాంగ్రెస్ ప్రకటించిన విధంగా తాము అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు ఇస్తామని ప్రకటించింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 31.01.2025 నాటికి తెలంగాణలో 5,10,265 ఆటోలు రన్నింగ్‌లో ఉన్నాయి. వాటికి డ్రైవర్లు సైతం అంతే మంది ఉన్నారని ఇటీవల అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం చెప్పింది. అయితే, అనధికారిక లెక్కల ప్రకారం తెలంగాణలో సుమారు ఏడున్నర లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నట్టు ఆటో డ్రైవర్ యూనియన్ నేతలు తేల్చి చెప్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రభుత్వం ఇస్తామన్న రూ.12 వేలు ఎటూ సరిపోవని, ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం కనీసం రూ.20 వేల జీవన భృతి ఇవ్వాలని నాటి నుంచీ డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఇస్తామన్న రూ.12 వేలనూ నేటికీ ఇవ్వడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 5,10,265 ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.612,31,80,000 ఇవ్వాల్సి ఉన్నది. ఇవి 17 నెలలకు కలిపితే మొత్తం సుమారు రూ.1,000 కోట్ల వరకు ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు బాకీ పడింది.

### అప్పులు అధికమై.. పోషణ భారమై..

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలు ఎక్కే వారే కరువయ్యారని ఆటో డ్రైవర్లు గగ్గోలు పెడుతున్నారు. లక్షలు పెట్టి ఆటోలు కొనుక్కొని వాటి ద్వారానే కుటుంబాలను పోషించుకుంటూ, పిల్లలకు చదువులు చెప్పిస్తూ సంతోషంగా గడుపుతున్న సమయంలో ఈ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం తీసుకొచ్చిందని ఆందోళన చెందుతున్నారు. అప్పులు భారమై.. నడిరోడ్డుపై చెట్లకు ఉరేసుకున్నవారు కొందరైతే.. పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నవారు ఇంకొందరు. రాత్రి ఆటోతో ఇంటికొచ్చిన తర్వాత.. ఖర్చులకు డబ్బులు సరిపోవని తెలిసి.. అనుభవించే ఆ మానసిక వ్యథ భరించరానిదిగా ఉంటుందని పలువురు అంటున్నారు. ఆ మనోవేదనను తట్టుకోలేక అర్ధరాత్రి వేళ పిల్లలు పడుకున్న తర్వాత కొందరు ఉసురు తీసుకుంటున్నారని కన్నీటి పర్యంతమవుతున్నారు.

మంచి వార్తలు ntnews.com లో చూడగలరు

